మహిళలు, పురుషులు సమానం

ద.మ.రైల్వే సెమినార్‌లో ఎజిఎం ఉదయ్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

సమాజంలో మహిళలు, పురుషులు సమానమేనని దక్షిణ మధ్య రైల్వే అడిషనల్ జనరల్ మేనేజర్ పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. బాధ్యతల్ని సమానంగా పంచుకుంటేనే కుటుంబాలు ఉన్నతంగా తీర్చిదిద్దబడతాయని చెప్పారు. మహిళా దినోత్సవం సందర్భంగా సికింద్రాబాద్ రైల్ నిలయంలో 'మహిళల ఆరోగ్యం-రక్షణ' అంశంపై జరిగిన సదస్సులో ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొని మాట్లాడారు. సమాజంలో మహిళలకు గుర్తింపు, గౌరవం, ప్రోత్సాహం ఇవ్వాలని, వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంచేలా పురుషుల ప్రవర్తన ఉండాలని చెప్పారు. మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం సుభిక్షంగా ఉంటుందన్నారు. వర్కింగ్ ఉమెన్స్‌కు ఆరోగ్యంపై మరింత అవగాహక కల్పించే కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. దక్షిణ మధ్య రైల్వే మహిళా సంక్షేమ సంఘం ఉపాధ్యక్షురాలు శ్రీలత మాట్లాడుతూ సమతుల్య ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని చెప్పారు. మహిళలకు శారీరక దృఢత్వం అవసరమన్నారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్‌కు చెందిన డాక్టర్ మోనికా, డాక్టర్ సిల్వియా ఫెర్నాండెజ్‌రావు మాట్లాడుతూ వ్యాధులను సకాలంలో గుర్తించడం, నివారణ, చికిత్స, పరిసరాల పరిశుభ్రత, క్రమం తప్పని ఆరోగ్య పరీక్షల ప్రాధాన్యత, మానసిక క్షేమం వంటి పలు విషయాలను వివరించారు.

పెద్ద బీరవల్లి, జానకీపురం, నారాయణపురం, చిన్న బీరవల్లి గ్రామాలకు

హక్కుల కోసం మహిళలు ఉద్యమించాలి

- ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మహిళలు తమ న్యాయమైన హక్కుల కోసం ఉద్యమించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి పిలుపునిచ్చారు. ఆదివారం ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం పస్రా గుడిసెవాసుల కేంద్రాన్ని ఆమె సందర్శించారు. అనంతరం కడారి నాగరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో చాకలి ఐలమ్మ, మల్లు స్వరాజ్యం లాంటివారు కీలక పాత్ర పోషించారని అని అన్నారు. నాటి నుండి నేటి వరకు మహిళలు లేని పోరాటం లేదని అన్నారు. ప్రధానంగా మహిళలకు గృహ అవసరం ఉంటుందన్న విషయాన్ని ప్రభుత్వాలు గుర్తించాలని అన్నారు. గూడు లేని ప్రతి కుటుంబానికి ఇల్లు నిర్మించి ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. రాష్ట్రంలో అనేక కేంద్రాల్లో ఇంటి స్థలాల కోసం మహిళలు ఆందోళన చేస్తున్నారని తెలిపారు. పస్రాలో 40 రోజులుగా మహిళలు ఇంటి స్థలాల కోసం ఉద్యమించడం అభినందనీయమని కొనియాడారు. మహిళలు చేస్తున్న ఈ పోరాటాలను ప్రభుత్వం గుర్తించి సమస్య పరిష్కారం చూపాలని కోరారు. మహిళా సంఘం సంపూర్ణ మద్దతు తెలిపారు తెలంగాణ ప్రభుత్వం వెంటనే స్పందించి ఇంటి స్థలాలకు పట్టాలు ఇవ్వాలని పక్కా ఇల్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. సదస్సులో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బీరెడ్డి సాంబశివ, రత్నం రాజేందర్, జిల్లా నాయకులు పొదిల్ల చిట్టిబాబు, గొంది రాజేష్, గుడిసె వాసుల కమిటీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఇంటర్ విద్యార్థి మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాకేష్ (ఫైల్ ఫొటో)

గుండెపోటుతో ఇంటర్ విద్యార్థి మృతి చెందిన ఘటన ఖమ్మం జిల్లా బోనకల్ మండలం బ్రాహ్మణపల్లి గ్రామంలో శనివారం రాత్రి జరిగింది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మరీదు లక్ష్మయ్య, నాగలక్ష్మమ్మ దంపతుల రెండవ కుమారుడు రాకేష్ (18) మధిరలోని ఓ ప్రయివేట్ కాలేజీలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. అయితే రెండు రోజుల కిందట రాకేష్‌కు జ్వరం రావడంతో స్థానికంగా ఆర్ఎంపి వద్ద చికిత్స చేయించారు. శనివారం ఉదయం గుండెలో నొప్పి వస్తుందని రాకేష్ చెప్పడంతో కుటుంబ సభ్యులు ఖమ్మంలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో చేర్పించారు. వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి గుండె సంబంధమైన వ్యాధి ఉందని వెంటనే హైదరాబాద్ తీసుకెళ్లాలని కుటుంబ సభ్యులకు సూచించారు. ఆర్థిక పరిస్థితుల వల్ల సోమవారం హైదరాబాద్‌కు తీసుకెళ్లొచ్చని కుటుంబ సభ్యులు శనివారం సాయంత్రం స్వగ్రామం తీసుకువచ్చారు. ఇంటికి వచ్చిన కొద్దిసేపటికి రాకేష్ గుండె నొప్పి వస్తుందని ఒక్క సారిగా మంచంపై పడుకొని వెంటనే ప్రాణాలు వదిలారు. రాకేష్ మృతి చెంద టంతో కుటుంబ సభ్యుల రోదన వర్ణాతీతంగా ఉంది. విద్యార్థి మృతి చెందటంతో ఆ గ్రామంలో విషాదఛాయలు కమ్ముకున్నాయి.

మహిళా కానిస్టేబుల్ అనుమానాస్పద స్థితిలో మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వరంగల్‌లో మహిళా కానిస్టేబుల్ అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. ఆదివారం స్థానిక వేణురావు కాలనీలో చోటుచేసుకున్న ఈ ఘటన కలకలం రేపుతోంది. మృతురాలిని మహబూబాబాద్ పోలీస్‌స్టేషన్‌లో రైటర్‌గా పనిచేస్తున్న మౌనికగా గుర్తించారు. భర్త, అత్తమామలు తమ కుమార్తెను వేధింపులకు గురి చేశారని మౌనిక తల్లిదండ్రులు చెబుతున్నారు. భర్తే ఉరి వేసి చంపి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నాడని వారు ఆరోపిస్తున్నారు. మౌనిక మృతదేహంపై గాయాలున్నట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని ఆమె తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

చట్ట ప్రకారం కొనుక్కొన్న భూములపై దౌర్జన్యం ఏంది?

- జిఒ 15ను వెంటనే రద్దు చేయాలి
- వక్ఫ్ బోర్డ్ బాధితుల జెఎసి డిమాండ్
- ఇందిరా పార్క్ వద్ద ధర్నా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

చట్ట ప్రకారం కొనుకున్న వక్ఫ్ బోర్డ్ భూముల మీద ప్రభుత్వ దౌర్జన్యం ఏందని.. బొడుప్పల్ బాధితులకు వెంటనే న్యాయం చేయాలని వక్ఫ్ బోర్డ్ బాధితుల జెఎసి డిమాండ్ చేసింది. ఆదివారం వక్ఫ్ బోర్డ్ బాధితుల జెఎసి అధ్వర్యంలో ఎనమిదవ రోజు రిలే నిరాహారదీక్షలు హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద ధర్నా చౌక్‌లో నిర్వహించారు. ఈ దీక్షకు ఎమ్మెల్యే ఈటల రాజేందర్, కాంగ్రెస్ మాజీ ఎంపి వి హనుమంతరావు, మాజీ ఎమ్మెల్సీ రామచంద్రరావు హాజరై మాట్లాడారు. బోడుప్పల్‌లో ఇళ్లు కట్టుకుని దశాబ్దాల నుంచి ఏడు వేల కుటుంబాలు నివసిస్తున్నాయన్నారు. వారు అన్ని రకాల ఛార్జీలు కట్టి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని తెలిపారు. అయితే 2018 వరకు ప్రయివేటు భూమి అని చెప్పిన ప్రభుత్వం ఎన్నికలైపోగానే అవి వక్ఫ్ భూములని అమ్మకాలు, కొనుగోలు బంద్ చేయిం చారన్నారు. బోడుప్పల్‌లో భూములు కొన్నప్పుడు ఏ లిటిగేషన్ లేదని ప్రభుత్వమే క్లియరెన్స్ ఇచ్చిందని.. మరి ఇన్నేళ్ల తరువాత ఇప్పుడు వక్ఫ్ భూములని ఎలా అంటారని ప్రశ్నించారు.

అప్పుడు వక్ఫ్ భూములని ప్రభు త్వానికే సోయి లేకపోతే కొన్న ప్రజలకు ఎట్లా తెలుస్తోందని ప్రశ్నించారు. ఏనాడూ బయటికి వెళ్లని వారు ఇక్కడికి వచ్చి ధర్నా చేస్తున్నారు అంటే ప్రభుత్వానికి సోయి ఉందా అని ప్రశ్నించారు. కొద్దిమంది మెప్పు కోసం ప్రజలను వేధిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

ఇందిరా పార్క్ వద్ద ధర్నాలో మాట్లాడుతున్న ఈటల రాజేందర్

ఆదాయం కోసం ప్రభుత్వ, బంజరు భూములను అమ్ముతున్న సర్కారు.. బోడుప్పల్ భూముల సమస్యను ఎందుకు పరిష్కరించదని ప్రశ్నించారు. వక్ఫ్ భూమి అని చట్టం నిర్ణయిస్తే వారికి ఎక్కడన్నా భూమి కేటాయించాలని, వారిని ఇబ్బంది పెట్టొద్దని అన్నారు. బోడుప్పల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రభుత్వ అనాలోచిత చర్య వల్ల విడుదల చేసిన జిఓ 15 వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన దీక్షలో జెఎసి కన్వీనర్ శ్రీధర్ రెడ్డి, కో చైర్మెన్‌లు, కార్పొరేటర్ కుంభం కిరణ్ కుమార్ రెడ్డి, కొత్త దుర్గమ్మ, పోగుల నర్సింహారెడ్డి, కిషోర్ గౌడ్, జెఎసి నాయకులు, కార్యకర్తలు, సభ్యులు పాల్గొన్నారు.

8 నుంచి పురపాలక శాఖలో మహిళా వారోత్సవాలు

- మంత్రి కెటిఆర్ ఆదేశాలు

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 8వ తేదీ నుంచి రాష్ట్రంలోని పట్టణాల్లో ఘనంగా మహిళా వారోత్సవాలను నిర్వహిస్తున్నట్టు పురపాలక శాఖ మంత్రి కె తారకరామారావు తెలిపారు. దీనికి అవసరమైన కార్యాచరణను రూపొందించాలని ఆదివారం ఆయన పురపాలక శాఖ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. పురపాలికల్లో వివిధ హోదాల్లో ప్రాతినిథ్యం వహిస్తున్న మహిళా ప్రజా ప్రతినిధులు, పురపాలక శాఖ సిబ్బంది, స్వయం సహాయక సంఘాల సభ్యులు, పారిశుద్ధ్య కార్మికులు, వివిధ ఎన్‌జిఒల సిబ్బందితో మహిళా దినోత్సవ వారోత్సవాలను నిర్వహించాలని నిర్ణయించారు. క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలు, మహిళలకు హెల్త్ క్యాంపులు, వివిధ రంగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన మహిళలు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు సన్మాన కార్యక్రమాలను చేపట్టనున్నట్టు మంత్రి తెలిపారు. అలాగే డ్రై కంపోస్ట్, కిచెన్ కాంపోస్టింగ్, నీటి సంరక్షణ వంటివాటిలో ఆదర్శవంతమైన పద్ధతుల్లో ముందుకెళ్తున్న పురపాలికల సిబ్బంది లేదా పట్టణంలోని మహిళలను ప్రత్యేకంగా గుర్తించి వారినీ సన్మానించాలని మంత్రి కెటిఆర్ సూచించారు. పట్టణాల్లో మహిళ స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో తయారైన ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకాల క్యాంపులు నిర్వహించాలని, ప్రభుత్వ రుణాలు, సబ్సిడీల వంటి వాటిని వినియోగించుకొని స్వయం సమృద్ధి సాధించిన వీధి వర్తకుల నుంచి, మహిళా వ్యాపారవేత్తల వరకు వివిధ రంగాలకు చెందిన ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలను ప్రత్యేకంగా గుర్తించాలని చెప్పారు. కంటి

వెలుగు ద్వారా పురపాలక శాఖలోని మహిళా ఉద్యోగులందరికీ ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తామన్నారు. మహిళా రక్షణ, మహిళ ఆరోగ్య సంరక్షణ, మహిళా సాధికారికత వంటి అంశాలపై ప్రత్యేక సమావేశాలు, చర్చాగోష్టులను నిర్వహించి మరింత అవగాహన పెంచేలా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. మహిళలకు వడ్డీ లేని రుణాలను పంపిణీ చేసే కార్యక్రమాలను కూడా సిద్ధం చేయాలన్నారు. మహిళా వారోత్సవాల్లో వివిధ శాఖల్లో పనిచేస్తున్న ఉన్నతాధికారులు, విభాగాధిపతులు, జిల్లా మహిళా కలెక్టర్లు, పోలీస్ ఉన్నతాధికారులు, మహిళా జడ్జీల వంటి వారిని ప్రత్యేక అతిథులుగా ఆహ్వానించాలని ఆదేశించారు. ఆ మేరకు ఎక్కడికక్కడ ప్రణాళికలు రూపొందించుకోవాలని చెప్పారు.

దళితులపై రెట్టింపైన దాడులు

- ఐక్యతతో ప్రతిఘటనకు సిద్ధం
- 14న 'చలో హైదరాబాద్'
- స్కైలాబ్ బాబు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

బిజెపి పరిపాలనలో దళితులపై దాడులు రెట్టింపయ్యాయని కుల వవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్‌బాబు తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కెవిపిఎస్ ఆధ్వర్యంలో 'ఎస్‌సి, ఎస్‌టి అత్యాచార నిరోధక చట్టం పకడ్బందీగా అమలు, ప్రయివేట్ రంగంలో రిజర్వేషన్ల' అంశంపై రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితులపై జరుగుతున్న దాడులను ఐక్యతతో సామాజిక సంఘాలు ప్రతిఘటనకు సిద్ధపడాలని పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో ఈ నెల 14న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు తెలిపారు. దేశంలో మతతత్వ ఎజెండాను అమలు చేస్తూ, మరో పక్క దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతోందని విమర్శించారు. ఇంకో పక్క పేదలపై మోయలేని భారాలు మోపుతున్నదని చెప్పారు. బిజెపి తొమ్మిదేళ్ల పాలనలో దళిత, గిరిజన, మైనార్టీ మహిళలను టార్గెట్‌గా చేసుకుని రెట్టింపు స్థాయిలో దాడులు చేస్తోందని తెలిపారు. 2014లో బిజెపి అధికారంలోకి వచ్చినప్పుడు 40,072 దాడులు జరిగితే, 2021 సంవత్సరం నాటికి అవి 50,900 పెరిగాయని గుర్తుచేశారు. ఎస్‌సి, ఎస్‌టి అత్యాచార నిరోధక చట్టాన్ని ప్రభుత్వాలు నిర్వీర్యం చేస్తున్నాయని విమర్శించారు. ఈ చట్టాన్ని పకడ్బందిగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు అమ్మేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. రిజర్వేషన్ల ఉనికికే ప్రమాదమేర్పడిందని చెప్పారు. తెలంగాణ వ్యవసాయ కార్మికసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకట్రాములు, తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ శ్రీరాం నాయక్ మాట్లాడుతూ వచ్చే జనాభా లెక్కల్లో కులగణన చేపట్టాలన్నారు. గిరిజనులను అడవి నుంచి వెళ్లగొట్టే దుర్మార్గాలకు కేంద్రం ఒడిగడుతున్నదని, ఈ కుట్రలకు వ్యతిరేకంగా ఉద్యమాలు నిర్వహించాలన్నారు. డిహెచ్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఏసురత్నం, డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పి శంకర్ మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ చట్టాన్ని దేశవ్యాప్తంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్, డిబిఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు నర్సింహ్మ మాట్లాడుతూ నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉచిత విద్య, వైద్యాన్ని అందరికీ అందించాలన్నారు. కార్యక్రమంలో బుడగ జంగాల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కడమంచి రాంబాబు, తెలంగాణ దళిత దండు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎర్రమల్ల మోగిలయ్య, కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు ప్రకాష్ కరత్ ,గంధం మనోహర్, జిల్లా నాయకులు జంగయ్య కుమార్, గంధం నాగరాజు, డిహెచ్‌పిఎస్ రాష్ట్ర కార్యదర్శి మారపాక అనిల్, జె ,కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్రమబద్ధీకరణ పేరుతో హాస్టళ్ల విలీనం సరికాదు

- ఆ ఆలోచనను విరమించుకోవాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

క్రమబద్ధీకరణ పేరుతో హాస్టళ్లను విలీనం చేయాలనే ఆలోచనను రాష్ట్ర సర్కారు విరమించుకోవాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది. ఆదివారం ఈ మేరకు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.ఎల్.మూర్తి, టి.నాగరాజు ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో 50 మంది కంటే తక్కువ విద్యార్థులున్న హాస్టళ్లను దగ్గరలో ఉన్న మరో హాస్టల్‌లో విలీనం చేయాలనీ, లేదంటే పోస్ట్ మెట్రిక్ హాస్టల్‌గా మార్చాలనే ఆలోచనలో క్యాబినెట్ సబ్‌కమిటీ ఉండటం దారుణమని పేర్కొన్నారు. గ్రామీణ, ఆదివాసీ, దళిత విద్యార్థుల విద్యాభివృద్ధికి పట్టుకొమ్మలుగా హాస్టళ్లు ఉన్నాయని తెలిపారు. విద్యార్థులను దగ్గరలోని హైస్కూల్స్ నుంచి హాస్టల్స్‌లో చేర్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. వారికి మెరుగైన సదుపాయాలు, మెస్, కాస్మోటిక్ చార్జీలను పెంచకుండా వాటిని నిర్వీర్యం చేయాలని చూడటం అన్యాయమని తెలిపారు. క్రమబద్ధీకరణ పేరుతో హాస్టళ్లను మూసివేసే కుట్రలను మానుకోవాలని హితవు పలికారు. తక్షణమే నిధులు మంజూరు చేసి వాటిలో సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అలా చేయని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

బస్తీ దవాఖానాలు పేదల దోస్తీ దవాఖానాలు

- దయాలసిస్ సెంటర్, బస్తీ దవాఖానా ప్రారంభించిన మంత్రి హరీశ్ రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పేద ప్రజల సుస్తీని తొలగించడమే లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా బస్తీ దవాఖానలను పేదల దోస్తీ దవాఖానలుగా తీర్చిదిద్దినట్టు వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్ రావు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా బస్తీ దవాఖానలను ఏర్పాటు చేసి 57 రకాల పరీక్షలు, 154 రకాల మందుల్ని ఉచితంగా అందిస్తున్నట్టు స్పష్టం చేశారు. ఆదివారం సిద్దిపేట జిల్లా దుబ్బాక పురపాలిక కేంద్రంలోని ప్రభుత్వ ఏరియా వంద పడకల ఆస్పత్రిలో కిడ్నీ పేషంట్ల కోసం "డయాలసిస్ సెంటర్", డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సముదాయంలో "బస్తీ దవాఖాన"ను మెదక్ ఎంపి కొత్త ప్రభాకర్ రెడ్డి, దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్ రావు, ఎమ్మెల్సీలు ఫారూఖ్ హుస్సేన్, యాదవ రెడ్డి, జడ్‌పి చైర్‌పర్సన్ రోజా శర్మ, మున్సిపల్ చైర్ పర్సన్ గన్నె వనిత భూమిరెడ్డితో కలిసి మంత్రి హరీశ్ రావు ప్రారంభించారు. దుబ్బాక ఏరియా ఆస్పత్రి వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన వీధి దీపాలనూ ప్రారంభించారు. అనంతరం హెచ్‌పీ గ్యాస్ గోదాం నుంచి దుంపలపల్లి వరకు నిర్మించ తలపెట్టిన బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రభుత్వ ఏరియా వంద పడకల ఆస్పత్రి ప్రారంభ సమయంలో ఎంపి ప్రభాకర్ రెడ్డి కోరిన డయాలసిస్ కేంద్రం ఏర్పాటు కోసం ఇచ్చిన హామీ మేరకు మంజూరు చేసి ప్రారంభించుకున్నామని తెలిపారు. కిడ్నీ సంబంధిత వ్యాధుల పేషెంట్లు గతంలో కరీంనగర్, సిద్దిపేట, సిరిసిల్ల, హైదరాబాద్‌కు పోయేవారని ఇక ఆ సమస్య తీరిందన్నారు. డయాలసిస్ పేషెంట్లకు ఆసరా పెన్షన్, ఉచిత బస్సు పాసులను అందిస్తున్న ఘనత కేవలం కెసిఆర్ సర్కార్ దేనన్నారు. త్వరలోనే వంద పడకల ఆస్పత్రిలో బ్లడ్ స్టోరేజ్ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. అన్ని వసతులతో కూడిన వెజ్, నాన్-వెజ్ ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనుల్ని వారంలోనే ప్రారంభిస్తామని మంత్రి వెల్లడించారు. కార్యక్రమంలో డిఎంహెచ్ఒ డా కాశీనాథ్, ఎంపిపి కొత్త పుష్పలత కిషన్ రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు, పిఎసిఎస్ చైర్మెన్ శేర్ల కైలాష్, ఎఎంసి చైర్‌పర్సన్ చింతల జ్యోతి కృష్ణ, మున్సిపల్ కమిషనర్ పాతూరి గణేష్ రెడ్డి, ఎఇ పృథ్వీరాజ్, ఎంపిడిఒ భాస్కర శర్మ, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ పేషంట్‌ను పరామర్శిస్తున్న మంత్రి హరీశ్‌రావు

మనుధర్మం పొంచివుంది

మహిళలూ... తస్మాత్ జాగ్రత్త

- తెలంగాణ సాహితి మహిళా ఫెస్ట్ 'అంతరంగ ఆవిష్కరణ'లో ఆనందాచారి

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

స్త్రీ స్వేచ్ఛను హరిస్తూ, మరోసారి వారిని వంటింటి కుందేళ్లుగా మార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఇలాంటి వాటిపట్ల మహిళలు అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ సాహితి ప్రధాన కార్యదర్శి కె ఆనందాచారి హెచ్చరించారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని కాదని, మూల రాజ్యాంగం పేరుతో మనుధర్మ శాస్త్రం పేరుతో పరిపాలించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు. మహిళల్లో, సమాజంలో ఎలాంటి భిన్నాభిప్రాయాలు ఉన్నా మానవీయ విలువలకు విఘాతం కల్పించి, విభేదాలు సృష్టించే మనువాదాన్ని ఐక్యంగా అడ్డుకోవాల్సిందేనని స్పష్టం చేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా తెలంగాణ సాహితి ఆధ్వర్యంలో 'అంతరంగ ఆవిష్కరణ' మహిళా ఫెస్ట్ సలీమ అధ్యక్షతన హైదరాబాద్ సుందరయ్య విజ్ఞానకేంద్రం దొడ్డి కొమురయ్య హాల్ బైరి ఇందిర ప్రాంగణంలో ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆనందాచారి మాట్లాడారు. మనుధర్మ శాస్త్రంలో మహిళలకు స్వేచ్ఛ లేదన్నారు. కుల, మత, వర్ణ, వర్గ వివక్షలతో మనువాదం నిండి ఉంటుందని, దీన్ని తిప్పికొట్టడానికి అభ్యుదయ సమాజం అనేక ఆటుపోట్లకు గురైందని వివరించారు. మహిళల 'అంతరంగ ఆవిష్కరణ'ల్లో ఎంతో వేదన, ఎన్నో కథలు దాగున్నాయన్నారు. వీటిని కన్నీళ్ల మధ్యే దాచేసుకోవడం సరికాదని, సమాజానికి పరిచయం చేయాల్సిన అవసరం ఉన్నదని అభిప్రాయపడ్డారు. మనుధర్మంతో మహిళా సమాజం అంతటికీ ప్రమాద ఘంటికలు మోగుతున్నాయని, దీన్ని గమనిస్తూ, ఎప్పటికప్పుడు ఆ దాడిని తిప్పికొట్టాలని దిశానిర్దేశం చేశారు. ప్రముఖ రచయిత్రి సూర్య ధనుంజయ ప్రారంభోపన్యాసం చేస్తూ 'అంతరంగ ఆవిష్కరణ'...పేరే చాలా గొప్పగా ఉందన్నారు. "యత్ర నార్యస్తు పూజ్యంతే-రమంతే తత్ర దేవతాః" అన్నంత పూజలు తమకు వద్దని, మహిళలూ మనుషులే అని గౌరవిస్తే చాలంటూ తన వ్యక్తిగత జీవిత వైచిత్ర్యాలు, మనోవేదనలను సభికులతో పంచుకున్నారు. ఆకాశం, అవనిలో సగభాగం ఉన్న మహిళలు, అవకాశాల్లో ఎందుకు సగం లేరని ప్రశ్నించారు. 'ఎదిగిన ఎత్తునుంచి కిందికి చూశా...విరిగిన నిచ్చెనలు కనిపించాయి' అంటూ భావోద్వేగానికి గురయ్యారు. లక్కరాజు నిర్మల మాట్లాడుతూ 'భావాలన్నీ మౌనంగా డైరీలై, నన్ను ఖైదీని చేశాయి' అంటూ తన అంతరంగ అనుభవాలను పంచుకున్నారు. అంతరంగ భావాలకు అక్షరరూపం ఇస్తే మనసులో ఏ బాధ ఉండదని, మార్గదర్శకులుగా నిలుస్తామని విశ్లేషించారు. ముందుగా ఇటీవల మరణించిన మహిళా కవులు, రచయిత్రులు బైరి ఇందిర, కె రామలక్ష్మి, శోభారాణికి నివాళులర్పించారు. ఆహూతులను వేదికపైకి రూపా రుక్మిణి ఆహ్వానించారు. సునీత ఉమాదేవి, తిరునగరి దేవకీదేవి, జూపాక సుభద్ర, తాళ్లపల్లి యాకమ్మ, ఝాన్సీ కొప్పిశెట్టి, ఉరిమళ్ల సునంద, మేరెడ్డి రేఖ, జరీనా బేగం. డాక్టర్ హసీనా తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆనందాచారి

కలకోట మేజర్‌కు సాగర్ నీరు విడుదల చేయాల్సిందే

- అన్నదాతల ఆందోళన
- దిగొచ్చిన అధికారులు.. నీరు విడుదల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కలకోట మేజర్‌కు సాగర్ నీటిని విడుదల చేసి ఎండిపోతున్న మొక్కజొన్న పంటను కాపాడాలని డిమాండ్ చేస్తూ అన్నదాతలు వైరా - జగ్గయ్యపేట ప్రధాన రహదారిపై రావినూతల - జానకీపురం గ్రామాల మధ్యగల కలకోట మేజర్‌పై ఆదివారం రెండు గంటల పాటు రాస్తారోకో నిర్వహించారు. ఈ కాలువ కింద పెద్ద బీరవల్లి, జానకీపురం, నారాయణపురం, చిన్న బీరవల్లి గ్రామాలకు చెందిన రైతులు వందలాది ఎకరాల్లో మొక్కజొన్న పంటను సాగు చేశారు. కానీ బోనకల్ బ్రాంచ్ కెనాల్‌కి తక్కువ నీటిని విడుదల చేయటంతో కలకోట మేజర్‌కు నీటిని విడుదల చేయడం లేదు. దాంతో సాగునీటి సమస్యతో పంటలు ఎండిపోతున్నాయని అనేకసార్లు నీటిపారుదల శాఖ అధికారులకు అన్నదాతలు మొరపెట్టుకున్న పట్టించుకోకపోవడంతో ఆయా గ్రామాల రైతులు వందమంది రోడ్డుపై ఆందోళనకు దిగారు. నీటిపారుదల శాఖ అధికారులలో చలనం లేకపోవడంతో మండల కేంద్రంలోని నీటిపారుదల శాఖ కార్యాలయానికి చేరుకున్నారు. దాంతో బోనకల్ ఇన్‌చార్జి డిఇ వల్లపు నాగ బ్రహ్మానికి సిపిఎం, సిపిఐ మండల కార్యదర్శులు దొండపాటి నాగేశ్వరరావు, యంగళ ఆనందరావు ఫోన్లో సమస్యను వివరించారు. కలకోట మేజర్ వద్ద ఎఇ రాజేష్ ఉన్నారని అక్కడికి వెళ్లాలని అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. దాంతో దొండపాటి నాగేశ్వరరావు, ఆనందరావు, సిపిఎం మండల కమిటీ సభ్యులు పెద్దపోలు కోటేశ్వరరావు బోనకల్ బ్రాంచ్ కెనాల్ వద్ద కలకోట మేజర్ తూము వద్దకు వెళ్లారు. అక్కడ ఎఇ రాజేష్‌తో వారు చర్చలు జరిపారు. ఈ చర్చల సందర్భంగా కలకోట మేజర్‌కు ప్రస్తుతం 120 క్యూసెక్కుల నీటిని విడుదల చేయమని ఉన్నతాధికారులు చెప్పడం, నీటిని విడుదల కూడా చేయడంతో అన్నదాతలు తమ ఆందోళన విరమించారు. కలకోట మేజర్ కింద సాగు చేసిన మొక్కజొన్న పంటలు మొత్తం తడిసే వరకు నీటిని సరఫరా చేయాలని అన్నదాతలు నీటిపారుదల శాఖ అధికారులను కోరారు. కార్యక్రమంలో రైతులు రాచబంటి స్వామి, షేక్ నాగుల మీర, పోతినేని నరసింహారావు, పెద్దపోలు రామారావు, చిన్నబోయిన నాగేశ్వరరావు, కోనంగి వేణు, రాచ బంటి సైదులు ఆ గ్రామాల రైతుల పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రాస్తారోకో చేస్తున్న పెద్ద బీరవల్లి, జానకీపురం, నారాయణపురం, చిన్న బీరవల్లి గ్రామాలకు చెందిన రైతులు

మోడీ తిరోగమన విధానాలతో దేశం వినాశనం

- ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర అధ్యక్షులు ప్రసాద్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రధాని నరేంద్ర మోడీ తిరోగమన విధానాలను అవలంభించడం వల్ల దేశం వినాశనమవుతున్నదని ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర అధ్యక్షులు ఆర్‌వి ప్రసాద్ విమర్శించారు. ఆదివారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెరిగిన ధరలతో సామాన్యులు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

కానీ కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు రాయితీలు కల్పిస్తున్నదని చెప్పారు. బిజెపి మత రాజకీయాలు దేశానికే ప్రమాదకరమని అన్నారు. విద్యార్థుల ఆత్మహత్యలకు కారణమవుతున్న కార్పొరేట్ కాలేజీ యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ర్యాగింగ్‌ను అరికట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫార్వర్డ్‌బ్లాక్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి రాములు యాదవ్, నాయకులు కొమ్మూరి వెంకటేశ్ యాదవ్, ఆవుల శ్రీకాంత్ యాదవ్, సయ్యద్ తౌఫిక్ అలీ, అజమత్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు

కామారెడ్డిలో కారు ప్రమాదం

- ఇద్దరు మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కామారెడ్డి శివారులో ఆదివారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. 44వ నెంబర్ జాతీయ రహదారిపై గర్గుల్ వంతెన సమీపంలో ముందు వెళ్తున్న కారును కంటైనర్ ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. మృతులను బాన్సువాడ మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన మధుసూదన్‌రెడ్డి (47), మహోధర్‌రావు (45)గా గుర్తించారు. క్షతగాత్రులను కామారెడ్డి ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కరీంనగర్ వెళ్లి బాన్సువాడ వైపు వెళ్తుండగా ప్రమాదం చోటు చేసుకుంది. కరీంనగర్ నుంచి బాన్సువాడ వెళ్తున్న సమయంలో ప్రమాదం చోటు చేసుకుంది. దేవునిపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నేడు కార్పొరేట్ కాలేజీలతో విద్యామంత్రి సమావేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని కార్పొరేట్ కాలేజీ యాజమాన్యాలతో విద్యాశాఖ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డి సోమవారం సాయంత్రం నాలుగు గంటలకు హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రం (ఎంసిఆర్‌హెచ్‌ఆర్‌డి)లో కీలక సమావేశం నిర్వహిస్తున్నారు. శ్రీచైతన్య కాలేజీలో చదివే సాత్విక్ అనే విద్యార్థి ఇటీవల ఆత్మహత్యకు పాల్పడి మరణించిన విషయం తెలిసిందే. ఈ కాలంలో ఇంటర్ విద్యార్థుల ఆత్మహత్యలు పెరుగుతున్నాయి. దీంతో ఈ సమావేశానికి ప్రాధాన్యత సంతరించుకుంది. ఆత్మహత్యల పట్ల విద్యార్థి, యువజన సంఘాలు, పలు రాజకీయ పార్టీలు, తెలంగాణ ప్రయివేటు జూనియర్ కాలేజీల యాజమాన్యాల సంఘం (టిపిజెఎంఎ) రాష్ట్ర ప్రభుత్వ తీరుతోపాటు ఇంటర్ బోర్డును వ్యతిరేకించాయి. కార్పొరేట్ కాలేజీలను కట్టడి చేయాలనీ, నిబంధనలు పాటించకపోతే గుర్తింపును రద్దు చేయాలనీ డిమాండ్ చేశాయి. కొన్ని సంఘాలు కార్పొరేట్ కాలేజీలను స్వాధీనం చేసుకుని ప్రభుత్వమే నిర్వహించాలని కోరాయి. ఈ సమావేశంలో ఏ నిర్ణయాలు తీసుకుంటారన్నది కీలకంగా మారనున్నది. సమావేశానికి ఆల్ఫోర్స్, దీక్ష, ఎక్స్‌లెన్సియా, ఫిట్‌జీ, గౌతమి, నారాయణ, ప్రగతి, రిజోనెన్స్, ఎస్‌ఆర్, షాహీన్, శ్రీఆదర్శ్, శ్రీచైతన్య, శ్రీమేధ, తపస్యతోపాటు టీపీజేఎంఏ అధ్యక్ష, కార్యదర్శులను కూడా ఇంటర్ బోర్డు ఆహ్వానించింది.

కెజిబివిలలో శ్రమదోపిడీ

- నాన్‌టీచింగ్ సిబ్బందికి కనీస వేతనమివ్వాలి
- సిఐటియు కోశాధికారి వంగూరు రాములు

సదస్సులో మాట్లాడుతున్న రాములు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో పనిచేసే నాన్‌టీచింగ్ సిబ్బందితో రాష్ట్ర ప్రభుత్వం వెట్టిచాకిరీ చేయిస్తూ శ్రమ దోపిడీకి పాల్పడుతోందని సిఐటియు రాష్ట్ర కోశాధికారి వంగూరు రాములు విమర్శించారు. ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కెజిబివి నాన్‌టీచింగ్ స్టాఫ్, వర్కర్స్ యూనియన్ (సిఐటియు అనుబంధం) రాష్ట్ర సదస్సు జరిగింది. ఈ సందర్భంగా వంగూరు రాములు మాట్లాడుతూ.. వాటిలో ఏడు రకాల పనులు చేస్తున్న సిబ్బందితో రోజుకు 12 నుంచి 14 గంటలు పనిచేయించడం దుర్మార్గమని పేర్కొన్నారు. నెలకు రూ.9,750 వేతనం ఇస్తే ఎలా బతకాలో రాష్ట్ర ప్రభుత్వం చెప్పాలని ప్రశ్నించారు. పెద్దపెద్ద గిన్నెలలో వండిన వంటలను కిచెన్ నుంచి డైనింగ్ హాల్‌కు తీసుకెళ్లే క్రమంలో మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అనారోగ్యాల పాలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అదనపు సిబ్బందిని నియమించాలని, వారాంతపు సెలవులు ఇవ్వాలని, కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కెజిబివిల్లో పనిచేసే నాన్‌టీచింగ్ సిబ్బంది తమ హక్కుల కోసం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. వారి పోరాటానికి సిఐటియు అండగా ఉంటుందని భరోసానిచ్చారు. కెజిబివి నాన్‌టీచింగ్ స్టాఫ్, వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసు మాధవి మాట్లాడుతూ.. కెజిబివిలలో పనిచేసే సిబ్బందికి ఇఎస్‌ఐ, పిఎఫ్, గుర్తింపు కార్డులు, ప్రమాదబీమా, బస్సు పాసు సౌకర్యాలను కల్పించాలని కోరారు. వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. బదిలీ సౌకర్యాన్ని కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు సంగారెడ్డి జిల్లా కార్యదర్శి జి సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

కెజిబివి నాన్ టీచింగ్ స్టాఫ్, వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులుగా పాలడుగు భాస్కర్

అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా వై లక్ష్మి, కాసు మాధవి

కేజీబీవీ నాన్ టీచింగ్ స్టాఫ్, వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులుగా పాలడుగు భాస్కర్, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా యాదరి లక్ష్మి, కాసు మాధవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కోశాధికారిగా పిట్ల మహేశ్వరి, ఉపాధ్యక్షులుగా ఎన్ లక్ష్మి, సహాయ కార్యదర్శి అలవేణి ఉండనున్నారు.

అక్టోబర్ 1న ఢిల్లీలో పాత పెన్షన్ శంఖారావం

- ఎన్‌ఎంఒపిఎస్ సెక్రెటరీ జనరల్ స్థితప్రజ్ఞ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అక్టోబర్ ఒకటో తేదీన ఢిల్లీలోని రాంలీలా మైదానంలో పాతపెన్షన్ సాధన కోసం శంఖారావం పూరిస్తామనీ, భారీ బహిరంగసభను నిర్వహిస్తామని నేషనల్ మూవ్‌మెంట్ ఫర్ ఓల్డ్ పెన్షన్ స్కీమ్ (ఎన్‌ఎంఒపిఎస్) సెక్రెటరీ జనరల్ స్థితప్రజ్ఞ పిలుపునిచ్చారు. జూన్ ఒకటి నుంచి పాత పెన్షన్ స్కీమ్ కోసం జాతీయ ఉద్యమం క్విట్ ఇండియా రథయాత్రను భారతదేశమంతా నిర్వహిస్తామని వివరించారు. ఆగస్టు ఒకటి నుంచి తొమ్మిది వరకు పాత పెన్షన్ పునరుద్ధరణ కోసం 'ఘంటి బజావో- పెన్షన్ దిలావో' అంటూ ఎంపి/ఎమ్మెల్యేలకు వినతిపత్రాలను సమర్పించే కార్యక్రమాన్ని చేపడతామని తెలిపారు. ఆదివారం ఎన్‌ఎంఒపిఎస్ జాతీయ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థితప్రజ్ఞ మాట్లాడుతూ నాడు కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన పిఎఫ్‌ఆర్‌డిఎ చట్టాన్ని నేడు బిజెపి ప్రభుత్వం కచ్చితంగా అమలు చేస్తూ ఉద్యోగుల సొమ్మును కార్పొరేట్ల పాలు చేస్తుందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వమే తెచ్చినా ఆ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో పిఎఫ్‌ఆర్‌డిఎ చట్టం వల్ల ఉద్యోగ, ఉపాధ్యాయులకు సామాజిక భద్రత చేకూరడం లేదంటూ పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తున్నాయని వివరించారు. బిజెపి పాలించే రాష్ట్రాల్లో ఉద్యోగ, ఉపాధ్యాయుల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చినా పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించడం లేదన్నారు. ఇటీవల హర్యానాలో ప్రజాస్వామ్యయుత పద్ధతిలో నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయులపై లాఠీఛార్జ్ చేయడం ఎవరి ప్రయోజనాల కోసమని ప్రశ్నించారు. ఈ చర్యను తీవ్రంగా ఖండించారు. 2024లో వచ్చే లోక్‌సభ సాధారణ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఉద్యమ కార్యాచరణను రూపొందించామన్నారు. దేశంలోని ప్రతి జిల్లాలో వచ్చే నెల 16న పెన్షన్ రాజ్యాంగ మార్చ్‌ను నిర్వహించాలని నిర్ణయించామని చెప్పారు. హర్యానా, మధ్యప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్రలో సీపీఎస్ ఉద్యమ కార్యాచరణను బలోపేతం చేస్తామని అన్నారు. ఓట్ ఫర్ ఓపీఎస్‌ను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ నుంచి సీపీఎస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్వల శ్రీకాంత్, రాష్ట్ర కోశాధికారి నరేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పొన్న లక్ష్మయ్యకు నవతెలంగాణ నివాళి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

నవతెలంగాణ ప్రింటింగ్ ప్రెస్ ఉద్యోగి పి.నగేష్ తండ్రి పొన్న లక్ష్మయ్యకు సంస్థ ఉద్యోగులు నివాళులర్పించారు. నల్లగొండ జిల్లా కట్టంగూరు మండలం చెరువు అన్నారం గ్రామంలోని స్వగృహంలో ఆయన చిత్రపటానికి పూల మాలవేసి శ్రద్ధాంజలి ఘటించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. ప్రగాఢ సానుభూతి తెలిపారు. నివాళులర్పించిన వారిలో నవతెలంగాణ సిజిఎం పి ప్రభాకర్, జనరల్ మేనేజర్లు వెంకటేష్, లింగారెడ్డి, రఘు, మేనేజర్లు వీరయ్య, గురు, పవన్, ఉపేందర్‌రెడ్డి, ప్రింటింగ్ ప్రెస్ ఉద్యోగులు తదితరులు ఉన్నారు.

ఎఇ పరీక్ష ప్రశాంతం

- టిఎస్‌పిఎస్‌సి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని వివిధ ఇంజినీరింగ్ శాఖలకు చెందిన విభాగాల్లో అసిస్టెంట్ ఇంజినీర్ (ఎఇ), మున్సిపల్ అసిస్టెంట్ ఇంజినీర్, టెక్నికల్ ఆఫీసర్ అండ్ జూనియర్ టెక్నికల్ ఆఫీసర్ పోస్టులకు ఆదివారం నిర్వహించిన రాతపరీక్ష ప్రశాంతంగా ముగిసిందని తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టిఎస్‌పిఎస్‌సి) ప్రకటించింది. ఈ మేరకు టిఎస్‌పిఎస్‌సి కార్యదర్శి అనితా రామచంద్రన్ ఒక ప్రకటన విడుదల చేశారు. 74,478 మంది దరఖాస్తు చేశారని తెలిపారు. వారిలో 68,257 మంది హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకున్నారని పేర్కొన్నారు. ఆదివారం ఏడు జిల్లాల్లో 162 పరీక్షా కేంద్రాల్లో ఈ పరీక్షను నిర్వహిస్తామని తెలిపారు. పేపర్-1కు 55,189 (74.10 శాతం) మంది, పేపర్-2కు 54,917 (73.73 శాతం) మంది హాజరయ్యారని వివరించారు. ఈ పరీక్షను టిఎస్‌పిఎస్‌సి చైర్మన్ బి.జనార్ధన్‌రెడ్డి, ఇతర సభ్యులు పర్యవేక్షించారని పేర్కొన్నారు. 837 పోస్టుల భర్తీకి గతేడాది సెప్టెంబర్ 12న నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే.

కేంద్రాన్ని ఎందుకు నిలదీయరు?

- తెలంగాణ ప్రయోజనాలు పట్టవా?
- రాజ్ భవన్‌కు హరీశ్ రావు ప్రశ్నలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రానికి కేంద్రంలోని బిజెపి సర్కార్ చేస్తున్న అన్యాయాలపై ఎందుకు మాట్లాడడం లేదని వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు ప్రశ్నించారు. తెలంగాణ ప్రయోజనాల గురించి కేంద్రాన్ని ఎందుకు నిలదీయరో సమాధానం చెప్పాలన్నారు. గవర్నర్ చేసిన వ్యాఖ్యలపై ట్విట్టర్ వేదికగా మంత్రి హరీశ్‌రావు స్పందించారు. ఈ మేరకు ఆదివారం ట్వీట్ చేశారు. 'మెడికల్ కాలేజీల విషయంలో తెలంగాణకు కేంద్రం తీవ్ర అన్యాయం చేసిందన్నది పచ్చి నిజం. రాష్ట్రానికి మెడికల్ కాలేజీలు మంజూరు చేయాలని పలు మార్లు కేంద్రాన్ని కోరితే 157 మెడికల్ కాలేజీల్లో ఒక్కటంటే ఒక్క మెడికల్ కాలేజీని తెలంగాణకు ఇవ్వకుండా మొండి చేయి చూపింది. ఒకటో దశ, రెండో దశలో ఇవ్వలేదు. మూడో దశలో ఇస్తామని చివరకు మోసం చేసింది. ఇప్పుడు నర్సింగ్ కాలేజీల విషయంలో కూడా అదే వివక్షను ప్రదర్శించింది. పైగా మెడికల్ కాలేజీల విషయంలో ఒక్కో మంత్రి ఒక్కో విధంగా మాట్లాడటం బాధాకరం. ఒకరు రాష్ట్ర ప్రభుత్వం అడగలేదు అంటే, మరొకరు కరీంనగర్, ఖమ్మంలో మెడికల్ కాలేజ్ కోసం అడిగిందనీ, అక్కడ ప్రయివేటు మెడికల్ కాలేజీలు ఉండటం వల్ల మంజూరు చేయలేకపోయాం అని చెబుతారు. ఎవరు ఎవర్ని మోసం చేస్తున్నారు, ఎవరు తప్పుదారి పట్టిస్తున్నారు.? కేంద్రం మెడికల్ కాలేజీ ఇవ్వకున్నా, పైసా నిధులు మంజూరు చేయకున్నా రాష్ట్ర ప్రభుత్వం సొంత నిధులతో 12 మెడికల్ కాలేజీలు ప్రారంభించింది. ఈ ఏడాది 9, మరో ఏడాది 8 ఇలా.. జిల్లాకు ఒక ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. లక్ష జనాభాకు 19 ఎంబిబిఎస్ సీట్లతో రాష్ట్రం దేశంలోనే నెంబర్ 1గా ఉండటం వాస్తవం కాదా? .. ఒకే ఏడాది, ఒకే రోజున తెలంగాణ ప్రభుత్వం 8 మెడికల్ ప్రారంభిస్తే, ప్రశంసించేందుకు మనస్సు రానివారు ఇలా పసలేని విమర్శలు, ఆరోపణలు చేయడం సమంజసమా?, గతంలో బీబీనగర్ ఎయిమ్స్‌కి రాష్ట్ర ప్రభుత్వం భూమి కేటాయించలేదు అని ఒక కేంద్ర మంత్రి నాలుక కరుచుకున్నరు. ఆధారాలు చూపిస్తే నోట మాట లేదు. ఇప్పుడు మెడికల్ కాలేజీల విషయంలోనూ అలాంటి అబద్ధాలు, ఆరోపణలు ప్రచారం చేస్తున్నారు. ఢిల్లీ ఎయిమ్స్ స్థాయిలో ఉండాల్సిన బీబీనగర్ ఎయిమ్స్, ఎందుకు గల్లీలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం స్థాయిలో కూడా లేదు? ఎందుకు అధ్వాన్నంగా ఉంది? రూ.1,365 కోట్ల నిధులు మంజూరు చేయాల్సి ఉన్నా, ఎందుకు రూ.156 కోట్లు (11.4 శాతం) మాత్రమే మంజూరు చేశారు? 2018 లో మంజూరైన గుజరాత్ ఎయిమ్స్‌కి 52 శాతం నిధులు ఇచ్చింది వాస్తవం కాదా? ...' అని హరీశ్ రావు ప్రశ్నలు వేశారు. ఎపి పునర్ విభజన చట్టం -2014 లో ఇచ్చిన హామీల మేరకు ట్రైబల్ యూనివర్సిటీ, రైల్వే కోచ్ ఫ్యాక్టరీ వంటి వాటిని మంజూరు చేసేలా కేంద్రంపై ఒత్తిడి తేవడంపై రాజ్‌భవన్ దృష్టి పెడితే రాష్ట్ర ప్రజలకు గొప్ప మేలు చేసిన వారవుతారని మంత్రి సూచించారు.

ఎన్‌విఎస్ రెడ్డికి సోషల్ (ఇంపాక్ట్) సిఇఒ ఆఫ్ ది ఇయర్ అవార్డు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ మెట్రోరైలు ఎండి ఎన్‌విఎస్ రెడ్డికి సోషల్(ఇంపాక్ట్) సిఇఒ ఆఫ్ ది ఇయర్ అవార్డు దక్కింది. అనేక ప్రముఖ పారిశ్రామికవేత్తలు, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లు సభ్యులుగా ఉన్న సిఇఒ క్లబ్స్ ఆఫ్ ఇండియా కార్యక్రమంలో హైదరాబాద్ మెట్రో రైల్ ఎండి ఎన్‌విఎస్ రెడ్డికి బెంగళూరులో జరిగిన 'గో బియాండ్ 2023' రిట్రీట్‌లో ప్రతిష్టాత్మక సోషల్ (ఇంపాక్ట్) సిఇఒ ఆఫ్ ది ఇయర్ అవార్డును ఆదివారం ప్రముఖ పారిశ్రామికవేత్త, థైరోకేర్ టెక్నాలజీస్ లిమిటెడ్ వ్యవస్థాపకులు డాక్టర్ ఆరోగ్యస్వామి వేలుమణి చేతులమీదుగా అందజేశారు. పబ్లిక్ ప్రయివేటు పార్టనర్‌షిప్ (పిపిపి) విధానంలో ప్రపంచంలోనే అతిపెద్ద మెట్రో రైలు ప్రాజెక్టును వినూత్న రీతిలో అమలు చేసి, హైదరాబాద్‌లోని ప్రయాణ సంస్కృతిపై ఎన్‌విఎస్ రెడ్డి చేసిన సామాజిక ప్రభావాన్ని గుర్తించిన సిఇఒ క్లబ్స్ ఆఫ్ ఇండియా వివిధ రంగాలలో దేశానికి ఆయన చేసిన సేవలను ప్రశంసించింది. 40 ఏండ్లకుపైగా తన సుదీర్ఘ కెరీర్‌లో నిర్వహించిన పదవుల్లో ఆయన చూపిన అంకిత భావాన్ని వక్కాణించింది. ఈ ప్రతిష్టాత్మకమైన అవార్డుకు ఆయనను ఎంపిక చేయడానికి ఆయనకున్న అసాధారణ ప్రాజెక్ట్ రూపకల్పన, నిర్వహణ సామర్థ్యాలను, ఇంజనీరింగ్, ఆర్థిక ఆవిష్కరణలను, నాయకత్వ లక్షణాలను, ఓపెన్ మైండెడ్ విధానాన్ని, కవితా నైపుణ్యాన్ని, ఆయన బహుముఖ వ్యక్తిత్వాన్ని కారణాలుగా పేర్కొంది. అదే కార్యక్రమంలో ప్రగతి ప్రింటర్స్ సిఎండి నరేంద్ర పరచూరి 'ఇండస్ట్రియలిస్ట్ ఆఫ్ ది ఇయర్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్' అవార్డును అందుకున్నారు.

తక్షణమే వేతన సవరణ సంఘం ఏర్పాటు చేయాలి

- ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి : బండి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

తక్షణమే వేతన సవరణ సంఘం ఏర్పాటు చేసి ఉద్యోగ, ఉపాధ్యాయులకు జులై ఒకటో తేదీ నుంచి పెరిగిన ధరలకు అనుగుణంగా జీతాలు చెల్లించాలని, ఇచ్చిన హామీలన్నీ వెంటనే అమలు చేయాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు, ఎంపి బండి సంజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం ఈ మేరకు సిఎం కెసిఆర్‌కు లేఖ రాశారు. 'ప్రతినెలా ఒకటో తేదీన జీతాలు తీసుకోవడం ఉద్యోగుల హక్కుగా ఉన్నప్పటికీ...సక్రమంగా చెల్లించకుండా వారి హక్కులను కాలరాస్తున్నారు. 317 జిఒ అమలు పేరుతో ఉద్యోగుల కుటుంబాలను ఛిన్నాభిన్నం చేసి మానసిక క్షోభకు గురి చేస్తున్నారు. ఉద్యోగులకు చెల్లించాల్సిన నాలుగు డిఎలనూ ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారు. స్వరాష్ట్రంలో సిఆర్ బిస్వాల్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన తొలి పిఆర్‌సి నివేదిక అమలులో జాప్యంవల్ల ఉద్యోగ, ఉపాధ్యాయులు 21 నెలలపాటు పెంచిన జీతాన్ని నష్టపోయారు. ఈ ఏడాది జూన్ 30 నాటితో మొదటి పిఆర్‌సి గడువూ ముగియబోతోంది. జులై ఒకటో తేదీ నుంచి కొత్త పిఆర్‌సి అమల్లోకి రావాలి. ఇప్పటివరకూ కమిషన్ నియమించకపోవడం దారుణం. ఇది ఉద్యోగులను, ఉపాధ్యాయులను దగా చేయడమే. వెంటనే ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి' అని లేఖలో పేర్కొన్నారు.

భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలి

- మంత్రి సత్యవతి రాథోడ్‌కు సిపిఎం వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కోయపోచగూడ గ్రామ ఆదివాసీ నాయకపోడ్ పేదల సాగులో ఉన్నభూములకు హక్కు పత్రాలు ఇవ్వాలని సిపిఎం కోరింది. ఆదివారం ఈ మేరకు గిరిజన శాఖ మంత్రి సత్యవతి రాథోడ్‌కు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.నాగయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు పి.ఆశయ్య వినతిపత్రం సమర్పించారు. 'మంచిర్యాల జిల్లా, దండేపల్లి మండలం కోయ పోచగూడెంలో 52 నాయకపోడ్ ఆదివాసీ కుటుంబాలు మాకులపేట శివారు సర్వే నెంబర్ 25,26లోని 150 ఎకరాల విస్తీర్ణం గల భూమిని 2002 నుంచి సాగు చేసుకుంటున్నారు. ఆ భూమిని సాగు చేయకూడదని అటవీ అధికారులు పోలీసులతో కలిసి గ్రామంపై దాడి చేసి చిత్రహింసలకు గురిచేశారు. అక్రమ కేసులు పెట్టారు. 12 మంది మహిళలను ఆదిలాబాద్ జైలులో ఉంచారు. జైలు నుంచి విడుదలై తిరిగి అదే భూమిని సాగు చేస్తున్నారు ....' అని పేర్కొన్నారు.

'ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం పోడు భూముల సర్వే చేసి హక్కుపత్రాలు పంపిణీ చేస్తామని సర్వే పనులు ప్రారంభించింది. ఆ సర్వేలో ఈ గ్రామాన్ని చేర్చలేదు. ఎన్నో సంవత్సరాలుగా సాగు చేసుకుంటూ, ఇక్కడే నివసిస్తున్న గిరిజనులు తీవ్రమైన ఆందోళన చెందుతున్నారు. మాకులపేట శివారు భూస్వాములు ఈ భూమిని గిరిజనులకు దక్కకుండా తాము స్వాధీనం చేసుకోవాలని ఇంతకాలం ఫారెస్ట్, రెవిన్యూ అధికారులను పక్కదారి పట్టించి అక్రమ కేసులు బనాయించారు' అని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ విషయంలో జోక్యం చేసుకుని ఈ భూమిని సర్వే జాబితాలో చేర్చి వాస్తవ సాగుదారులకు పట్టాలు ఇప్పించేందుకు మంచిర్యాల జిల్లా కలెక్టర్‌కు తగిన ఆదేశాలు జారీ చేయాలని వారు కోరారు. పేదల సాగులో ఉన్న భూములను సర్వే చేయించి, పట్టాలిప్పిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

'పది' పరీక్షా కేంద్రాల్లో సిసి కెమెరాలు

- చీఫ్ సూపరింటెండెంట్ గదిలో ఏర్పాటుకు ఉత్తర్వులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో పదో తరగతి వార్షిక పరీక్షలు ఏప్రిల్ మూడు నుంచి 13వ తేదీ వరకు జరగనున్నాయి. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లలో అధికారులు నిమగ్నమయ్యారు. అయితే పదో తరగతి పరీక్షా కేంద్రాల్లో సిసి కెమెరాలను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ప్రతి పరీక్షా కేంద్రంలోని చీఫ్ సూపరింటెండెంట్ గదిలో కచ్చితంగా సిసి కెమెరా ఉండాలని ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు ఎ.కృష్ణారావు ఆదివారం ఉత్తర్వులు విడుదల చేశారు. డిఇఒలు ఆ దిశగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సిసి కెమెరాలను అద్దెకు లేదా కొనుగోలు చేసి ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం అనుమతినిచ్చిందని తెలిపారు. సీల్డ్ రహస్య మెటీరియల్‌ను సిసి కెమెరాల పర్యవేక్షణలో చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు తెరవాలని ఆదేశించారు. పరీక్షలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని కోరారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. జిల్లాలో ఎన్ని పరీక్షా కేంద్రాలు ఉన్నాయి, సిసి కెమెరాలు అందుబాటులో ఉన్నాయా?, ఎన్నింటిలో లేవు వంటి వివరాలను సోమవారం నాటికి డిఇఒలు ప్రభుత్వానికి పంపించాలని కోరారు. ప్రయివేటు పాఠశాలల్లో సిసి కెమెరాలను ఏర్పాటు చేసే బాధ్యత ఆయా యాజమాన్యాలదేనని స్పష్టం చేశారు.

సాత్విక్ ఆత్మహత్యపై విచారణకు కమిటీ

- ఇంటర్ బోర్డు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నార్సింగి శ్రీచైతన్య కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థి సాత్విక్ (16) ఆత్మహత్య కేసులో మరో ట్విస్ట్ వెలుగు చూసింది. విద్యార్థి ఆత్మహత్యపై సమగ్ర విచారణ చేపట్టాలని ఇంటర్ బోర్డు విచారణ కమిటీని ఏర్పాటు చేసింది. విచారణ చేపట్టిన కమిటీ.. రిపోర్టులో పలు కీలక విషయాలు వెల్లడించింది. సాత్విక్ ఆత్మహత్య చేసుకున్న కళాశాలలో అతనికి అడ్మిషన్ లేదని పేర్కొంది. ఒక కళాశాలలో అడ్మిషన్ తీసుకుని మరో కాలేజీలో తరగతులు నిర్వహిస్తున్నారని నివేదికలో వెల్లడించింది. అడ్మిషన్ సమయంలో నార్సింగి కళాశాల పేరుతోనే తమకు రశీదు కూడా ఇచ్చారని, తమకు న్యాయం చేయాలని సాత్విక్ తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. సాత్విక్ ఆత్మహత్య కేసులో ఇప్పటి వరకు నలుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కళాశాలలో ఉపాధ్యాయుల వేధింపులు, హింస, అవమానం భరించలేక తరగతి గదిలో ఉరి వేసుకుని తన కుమారుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడని రాజప్రసాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలం, సూసైడ్ నోట్ ఆధారంగా శ్రీచైతన్య కళాశాల అడ్మిన్ ప్రిన్సిపల్ అకలంకం నర్సింహాచారి అలియాస్ ఆచారి, ప్రిన్సిపల్ తియ్యగురు శివ రామకృష్ణారెడ్డి, హాస్టల్ వార్డెన్ కందరబోయిన నరేశ్, వైస్ ప్రిన్సిపల్ ఒంటెల శోభన్‌బాబులను అరెస్టు చేసి రాజేంద్రనగర్‌లో న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. ఆయన ఆదేశాల మేరకు నలుగురినీ చర్లపల్లి జైలుకు తరలించారు.

ఎంజిఎంలో గుత్తేదారు దోపిడీ

- దినసరి వేతన కార్మికుల దీనస్థితి
- రూ.81.60 లక్షల స్వాహా
- సామగ్రి పేరిట రూ.12.60 లక్షలు
- కార్మికులను లూఠీ చేస్తున్న వైనం
- సమగ్ర విచారణకు డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉత్తర తెలంగాణ జిల్లాలకు పెద్ద దిక్కుగా ఉన్న ఎంజిఎం ఆస్పత్రిలో దినసరి వేతన కార్మికులను నిలువునా దోచుకోవడం నిత్యకృత్యంగా మారింది. ఆస్పత్రిలో సుమారు 769 మంది కార్మికులకు నెలకు రూ.1.20 కోట్లను వేతనాలుగా గుత్తేదారుకు చెల్లిస్తున్నారు. క్షేత్రస్థాయిలో మాత్రం సుమారు 350 మంది మాత్రమే పనిచేస్తున్నారు. మిగతా 410 మంది ఎవరు..? కాగితాలపైనే చూపించి వేతనాలను స్వాహా చేస్తున్నారా? అనేది ప్రశ్నగా మారింది. ఇలా గుత్తేదారు నెలకు రూ.81.60 లక్షలు స్వాహా చేస్తున్నట్టు తెలుస్తోంది. ఇందులో రూ.12.60 లక్షలు 350 మంది కార్మికుల వేతనాల నుంచి ప్రతినెల కోత విధిస్తూ బ్లీచింగ్ పౌడర్, ఫినాయిల్, చీపుర్లు, డస్ట్‌బిన్లు కొనుగోలు చేస్తున్నట్టు సమాచారం. ఇంత జరుగుతున్నా కార్మికులు నోరెత్తకుండా ఉండడానికి సూపర్‌వైజర్‌లను ఏర్పాటు చేశారు. వీరంతా కార్మికులు ప్రశ్నించకుండా వారిని ఎప్పటికప్పుడు పకడ్బందీగా అడ్డుకుంటుంటారు. అంతేకాదు, సూపర్‌వైజర్లే ఆసుపత్రిలో గుత్తేదారుకు బ్రోకర్లుగా వ్యవహరిస్తున్నారు. ఎవరిని తీసుకోవాలన్నా ఈ సూపర్‌వైజర్ ఆజ్ఞ మేరకే జరుగుతున్నట్టు తెలుస్తుంది. పలువురు కార్మికులు డాక్టర్ల ఇండ్లలో పనిచేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఎంజిఎం సూపరింటెండెంట్, ఆర్‌ఎంఒకు ఈ వ్యవహారంలో పాత్ర ఉందని కార్మికులు ఆరోపిస్తున్నారు. ఈ కుంభకోణంపై సమగ్ర దర్యాప్తు జరిపి దోషులను శిక్షించి తమకు రావాల్సిన వేతనాన్ని పూర్తిస్థాయిలో ఇప్పించాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. వరంగల్ ఎంజిఎం ఆస్పత్రిలో దినసరి వేతన కార్మికులుగా 769 మంది కార్మికులు ఉన్నట్టు అధికారిక రికార్డులున్నా, క్షేత్రస్థాయిలో మాత్రం 350 మంది మాత్రమే పనిచేస్తున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. వీరిలో 22 ఏండ్లుగా పనిచేస్తున్న కార్మికులు ఉన్నారు. వీరిలో స్వీపర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, పేషంట్ కేర్ అటెండెంట్లు, సెక్యూరిటీ గార్డులు ఉన్నారు. ఒక్కో కార్మికుడికి రూ.15,600 వేతనం. ఇందులో రూ.1000 పిఎఫ్, ఇఎస్ఐ పోగా రూ.14,500 చెల్లించాలి. కానీ రూ.11,000 మాత్రమే చెల్లిస్తున్నారు. దానిలో రూ.3,600 నెలకు చీపుర్లు, బ్లీచింగ్, ఫినాయిల్, డస్ట్‌బిన్స్ పేరిట ఒక్కో కార్మికుని వేతనం నుంచి కోత విధిస్తున్నారు. 769 మంది కార్మికులకు నెలకు రూ.1.20 కోట్ల వేతనాలను సదరు గుత్తేదారుకు ఆస్పత్రి అధికారులు బదిలీ చేస్తుండగా, ఇందులో నెలకు రూ.81.60 లక్షలు గుత్తేదారు స్వాహా చేస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. సామగ్రి పేరిట మరో రూ.12.60 లక్షలు స్వాహా చేయడం గమనార్హం. కార్మికులపై సూపర్‌వైజర్లను పెట్టడంతో వారి అగడాలకు అడ్డూ అదుపులేకుండా పోయింది. కార్మికులకు జరుగుతున్న అన్యాయాన్ని వారు ప్రశ్నించకుండా వీరు అడ్డుకుంటున్నారు. ప్రశ్నిస్తే ఉద్యోగం ఊడిపోతుందని బెదిరిస్తుండటంతో నోరు మూసుకొని ఎంత వేతనమిస్తే అంతే వేతనంతో పనిచేస్తున్నారు.

సూపర్‌వైజర్ల భార్యలకూ వేతనాలు..

సూపర్‌వైజర్ల భార్యలను దినసరి వేతన కార్మికులుగా పేపర్‌పై చూపించి వేతనాలు తీసుకుంటున్నట్టు తెలిసింది. క్షేత్రస్థాయిలో సూపర్‌వైజర్ల సతీమణులు పనిచేయకున్నా వేతనాలు మాత్రం తీసుకుంటున్నారు. సూపర్‌వైజర్లు గుత్తేదారుకు బ్రోకర్‌గా వ్యవహరిస్తూ అటు గుత్తేదారుకు, ఇటు డాక్టర్లకు పనులు చక్కపెడతారని సమాచారం. డాక్టర్ల ఇండ్లలోకి దినసరి వేతన కార్మికులను పనులు చేయడానికి సూపర్‌వైజర్ పంపుతున్నారు. ఈ విషయాన్ని సదరు కార్మికులు బహిర్గతం చేయకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. కార్మికుల గొంతునొక్కడానికి నలుగురు సూపర్‌వైజర్లను నియమించి గుత్తేదారు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.

నియామకాల్లో అవినీతి

ఇటీవల ఎంజిఎం ఆస్పత్రిలో 8 మంది దినసరి వేతన కార్మికులను విధుల్లోకి తీసుకున్నారు. వీరంతా రూ.1 లక్ష నుంచి రూ.3 లక్షలు సదరు కాంట్రాక్టు కంపెనీకి చెల్లించినట్టు సమాచారం. ప్రజాప్రతినిధులు చెప్పిన వ్యక్తులను విధుల్లోకి తీసుకుంటున్నారని, ఈ విషయం ఆస్పత్రి అధికార యంత్రాంగానికి తెలిసినా తెలియనట్టే వ్యవహరిస్తున్నదని ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారాలు చూసే ఆర్‌ఎంఒ ప్రతి పనిలో సురేష్ అనే సూపర్‌వైజర్‌ను మాత్రమే సంప్రదిస్తారని తెలుస్తున్నది. ఇంత పెద్ద కుంభకోణం విషయంలో ఆస్పత్రి అధికార యంత్రాంగం ఏమీ పట్టనట్టు వ్యవహరించడం గమనార్హం.

కలెక్టర్ ఆదేశాలూ బేఖాతర్

కరోనా సమయంలో విధులు నిర్వహించి అనంతరం తొలగించిన పలువురు దినసరి వేతన కార్మికులు వరంగల్ జిల్లా కలెక్టర్ బి.గోపిని పలుమార్లు కలిసి మొరపెట్టుకోగా, వారందరినీ విధుల్లోకి తీసుకోవాలని ఎంజిఎం సూపరింటెండెంట్‌ను కలెక్టర్ ఆదేశించారు. సూపరింటెండెంట్, సదరు ఆర్‌ఎంఒకు ఆదేశాలు జారీ చేసినా సదరు సూపర్‌వైజర్, కాంట్రాక్టర్ ఆ ఆదేశాలను బుట్టదాఖలు చేసి రూ.1 లక్ష నుంచి రూ.3 లక్షలు ఇచ్చిన వారినే విధుల్లోకి తీసుకోవడంతో గతంలో విధులు నిర్వహించి తొలగించబడ్డ కార్మికులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా మాకు న్యాయం చేయాలని కోరుతున్నారు. ఆస్పత్రిలో జరుగుతున్న అక్రమాలపై విచారణ జరిపి దోషులను శిక్షించాలని డిమాండ్ చేస్తున్నారు.